ప్రజావాణికి 118 ఫిర్యాదులు

- రెవెన్యూ శాఖవే అత్యధికం
- ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్యశారద

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

ఇండ్ల యాకలక్ష్మి, రాజయ్య దంపతులు

వీల్‌చైర్‌లో వస్తున్న మధూకర్

ఖిలావరంగల్, జూలై 8: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో 118 దరఖాస్తులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూశాఖకు చెందినవే అత్యధికంగా 76 దరఖాస్తులు వచ్చాయి. పైడిపల్లి, కొత్తపేట శివారులో పేదలు వేసుకున్న గుడిసెలను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది కూల్చేయగా 2,700 కుటుంబాలు రోడ్డున పడ్డారని, వారికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ధరణిలో నమోదై, రైతుబంధు డబ్బులు వస్తున్న తన 19గుంటల భూమిని కొందరు వెంచర్ పేరుతో కాజేశారని కలెక్టర్‌కు ఖిలావరంగల్‌కు చెందిన దివ్యాంగుడు మధూకర్ వీల్‌చైర్‌పై వచ్చి వినతిపత్రం ఇచ్చారు. ఖానాపూర్ మండలానికి చెందిన వృద్ధురాలు పుల్ల యాకమ్మ తన భూమిని బంధువులు కబ్జా చేశారని విన్నవించారు. 2003లో భర్త ఆరు ఫీట్ల దారితో 3.02 ఎకరాలు కొనుగోలు చేయగా, తమ పక్కనున్న భూమిని కొనుగోలు చేసిన తాళ్లపెల్లి చంద్రశేఖర్, శ్రీనివాస్ వ్యవసాయ భూమికి వెళ్లే దారిని కబ్జా చేయడంతోపాటు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టారని వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన మంచోజు రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. ఓంకార్ స్వీట్ సోంపు వక్కపొడి కంపెనీలో పనిచేస్తున్న తన భర్త రాజయ్యపై గత ఏడాది మే నెలలో ప్రమాదవశాత్తు డబ్బాలు మీదపడి తీవ్రంగా గాయపడ్డాడని, అదే రోజు కంపెనీ బాధ్యులు దవాఖానకు తీసుకువెళ్లారని, మూడు నెలల తర్వాత గాయాలు సెప్టిక్ కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందినప్పటికీ కంపెనీ బాధ్యులు నష్ట పరిహారం ఇవ్వడం లేదని, పోలీస్ కేసు పెట్టినా, లేబర్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఇండ్ల యాకలక్ష్మి ఫిర్యాదులో తెలిపారు. వారసత్వంగా వస్తున్న భూమిని సోదరుడు కబ్జా చేశాడని రాయపర్తి మండలం కొలన్‌పల్లికి చెందిన ఎం.దేవేందర్ ఫిర్యాదు చేశాడు. గేదెల కొనుగోలు కోసం ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన రుణం ఇవ్వాలని పర్వతగిరి మండలం వడ్లకొండకు చెందిన వల్లందాస్ ఎల్లయ్య వినతిపత్రం సమర్పించారు. జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన నెక్కొండ మండలం జడ్పీ స్కూల్ విద్యార్థి నిఖిల్‌ను కలెక్టర్ అభినందించి, శాలువాతో సత్కరించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన వినతులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈవో వాసంతి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

వరంగల్, జూలై 8 : బల్దియా గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 31వ డివిజన్‌లోని జేఎస్ఎం స్కూల్ ఎదురుగా ఉన్న ఠాగూర్ కాలనీలో సుమారు 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యాలు లేవని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 64వ డివిజన్ వెస్ట్ సిటీలో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్ల పైకి వస్తోందని, వెంటనే డ్రైనేజీలతో పాటు రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కమిషనర్‌ను కోరారు. 56వ డివిజన్‌లోని టీఎన్‌జీవోస్ కాలనీలో నిర్మించుకున్న కొత్త గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. 2వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో రోడ్లు, సైడ్ కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కనీస వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కొత్తవాడ మల్లికార్జున దవాఖాన రోడ్డు, పెద్ద మోరీపై స్లాబ్ కూలిపోయే స్థితిలో ఉందని, వెంటనే మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరారు. గ్రీవెన్స్ అనంతరం కమిషనర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి వినతిని అధికారులు పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌ను సమస్యల పరిష్కార వేదికగా మార్చాలన్నారు. గ్రీవెన్స్‌లో ఎస్ఈలు కృష్ణారావు, సీఎంహెచ్‌వో రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర లింగం, టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని

కామన్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సుబేదారి, జూలై 8 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీబీ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్లు, సిబ్బందికి సూచించారు. సోమవారం నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్–ఈ గవర్నెన్స్ సర్వీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు టెక్నాలజీ అందిపుచ్చుకొని పాన్‌కార్డు, విద్యుత్, నల్లా, గ్యాబ్ బిల్లులు, ఇతర ఆన్‌లైన్ చార్జీలు చెల్లింపు సేవలు కష్టమర్లకు అందించి ఆర్థికంగా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీజీఎం అశోక్, బ్రాంచ్ మేనేజర్లు, సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.

'వన మహోత్సవం' లక్ష్యాలను సాధించాలి

ఖిలావరంగల్: వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా ఈ ఏడాది నాటాల్సిన మొక్కలకు సంబంధించి శాఖలవారీగా లక్ష్యాలను గుర్తుచేస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. వానకాలం ప్రారంభమైనందున మొక్కలు విరివిగా నాటాలని సూచించారు అనువైన స్థలాలను గుర్తించి మొక్కలు నాటడంతోపాటు జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాకు 25,58,317 మొక్కలు నాటే లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం ప్రగతిపై రోజువారీగా నివేదికలు సమర్పించడంతోపాటు వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఎంహెచ్‌వో ఓ డాక్టర్ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలను పెంచాలి

నర్సంపేట రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలను పెంచాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి సుంచు జగదీష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు ఏఐసీటీయూ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీలో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న 13మంది ఎన్ఎంఆర్ కార్మికుల జీతాలు పెంచాలన్నారు. సర్క్యులర్ ప్రకారం వేతనాలు పెంచాలని కార్మికులు పదే పదే అధికారులను అడిగినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని తెలిపారు. తక్షణమే ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలు పెంచి, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, రాగినేని ఐలయ్య ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కాపులకనపర్తిలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం/గీసుగొండ, జూలై 8: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో సోమవారం సంగెం మండలం కాపులకనపర్తి గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వన మహోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. డీఆర్‌డీఓ జె.కౌసల్యాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి వి.వేదవతి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, మాజీ ఎంపీపీ కళావతి, మండల నోడల్ అధికారి నరసింహాచార్యులు, ఏపీఎం డి.కిషన్, ఇన్‌చార్జి ఏపీఓ గణేశ్ పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే రేవూరి సంగెం రైతువేదికలో 40 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలువేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనగామ రమేశ్, నరహరి, ఏపీఆర్, ఎం.రమేశ్, నాగరాజు, కోటేశ్వర్, వీరమ్మ, నర్సింహానాయక్, పులి సాంబయ్య పాల్గొన్నారు. కాగా, గీసుగొండ మండలం కోనాయిమాకుల రైతువేదికలో 48మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేవూరి కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వజ్రోత్సవ వన మహోత్సవంలో మొక్కలను నాటి నీళ్లు పోశారు. తహసీల్దార్ రీయాజుద్దీన్, మండల నాయకులు చాడ కొమురారెడ్డి, వీరగోని రాజుకుమార్, సౌజన్య, అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రవీణ్. సంతోశ్, శ్రీకాంత్, భరత్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సంగెం, జూలై 8: మండలంలోని ఎల్గూర్‌రంగంపేటకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామానికి గతంలో నాలుగు ట్రిపులు బస్సు నడిచేదని, రోడ్డు సరిగ్గాలేదని బంద్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్డు బాగుందని గ్రామస్తులు వరంగల్‌కు వెళ్లాలంటే తిమ్మాపురం వరకు కాలినడక వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బొమ్మాల శంకర్, ముజ్జిగ అనిల్, సునిల్ ఉన్నారు.

జిల్లాలో 21 సెంటీమీటర్ల వర్షపాతం

ఖిలావరంగల్, జూలై 8: వరంగల్ జిల్లాలో సోమవారం తెల్లవారుజాము వరకు సగటున 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వరంగల్ మండలంలో 75.6 సెంటీమీటర్లు, పర్వతగిరిలో 54.8 ఖిలావరంగల్ 46.4, సంగెంలో 28 వర్ధన్నపేటలో 20.8 నమోదైంది. గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపూర్, నెక్కొండ మండలాల్లో మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

వీడియో సాంగ్ రిలీజ్

ఖిలావరంగల్, జూలై 8: ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయుడు ఆడెపు రవీందర్ రచన, నటన, దర్శకత్వం వహించి రూపొందించిన 'కడచూపు కైనా వస్తావని' వీడియో సాంగ్‌ను సోమవారం మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో సీఐ పీ మల్లయ్య ఆవిష్కరించారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల్లో మార్పు తీసుకువచ్చే ప్రయత్నంలో రవీందర్ రాసిన పాట అద్భుతంగా ఉందని సీఐ కొనియాడారు. నటులు రామచందర్ గోవాల్, కన్నయ్య, కావటి స్వామి, ఐతరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఆర్డీఎఫ్ విద్యార్థి ప్రతిభ

పర్వతగిరి, జూలై 8: మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముక్కెర హాసిని రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు బాషబోయిన రాములు తెలిపారు. ఉమ్మడి వరంగల్ అథ్లెటిక్స్ అండర్ 10 విభాగంలో 100 మీటర్ల పోటీల్లో పాల్గొని స్టేట్ స్థాయిలో 5వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి ఆమెను అభినందించారు. ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి జే.బాలరాజు, పీఈటీ సురేష్, సునీల్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన న్యాయవాది పూర్ణచందర్

గీసుగొండ, జూలై 8: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝాను మండలంలోని శాయంపేటకు చెందిన న్యాయవాది కొంగర పూర్ణచందర్ సోమవారం కలిశారు. కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయ వాధులు పాల్గొన్నారు.

హేమంత్ సహదేవ్‌రావును కలిసిన కలెక్టర్

ఖిలావరంగల్, జూలై 8: వరంగల్ కలెక్టరేట్‌కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవ్‌రావును కలెక్టర్ సత్యశారద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం ఎంజీఎం దవాఖానకు అవసరమైన మందులు, కెమికల్స్, పరికరాలు, మరమ్మతులపై చర్చించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

యశోదమ్మ(ఫైల్)

పర్వతగిరి, జూలై 8: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు మోటుపల్లి యశోదమ్మ (101) సోమవారం మృతి చెందింది. ఆమె గతంలో తన ఇల్లునే ప్రైవేట్ పాఠశాలగా మార్చి అనేకమందికి చదువు చెప్పేదని స్థానికులు గుర్తుచేసుకున్నారు. ఆమె సేవలను కొనియాడారు. భర్త బుచ్చమాచార్యులు గతంలో మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుమార్తె ఇంట్లో ఉంటున్నారు.

సంగెం మండల ప్రత్యేకాధికారిగా వేదవతి

సంగెం, జూలై 8: మండల ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారిగా వరంగల్ డీఎల్‌పీఓ వి.వేదవతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజాపరిషత్ సభ్యుల పదవీ కాలం పూర్తికావటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించిన విషయం విధితమే. ఈమేరకు ప్రత్యేకాధికారి వేదవతిని ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్యతోపాటు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఆర్ చేసినా నిలవని ప్రాణం

గిర్మాజీపేట, జూలై 8: నగరంలో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఆటోడ్రైవర్ కిషన్‌ప్రసాద్ పాతబీటుబజార్ వద్ద రోడ్డుపై పడి ఉన్నాడు. అతడు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎంటీ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌తోపాటు ట్రాఫిక్ హోంగార్డ్ చూసి వెంటనే సీపీఆర్ చేశారు. ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మచ్చ శివకుమార్ కూడా సీపీఆర్ చేసి తన వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఎంజీఎం దవాఖానలో వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. ఆపదలో ఉన్న వారికి సాయం చేసేందుకు ముందుకు వచ్చిన పోలీసులను స్థానికులు అభినందించారు.

ఐడీ కార్డులు, నోట్‌బుక్స్ అందజేత

నర్సంపేట రూరల్, జూలై 8: మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా గుర్తింపు కార్డులు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. పాఠశాల చైర్మన్ దూపటి సరిత, పాఠశాల హెచ్ఎం ఎస్‌కే సర్ధార్ మాట్లాడుతూ ప్రభుత్వ సాయంతోపాటు ఉపాధ్యాయులు సొంతంగా నోట్‌బుక్స్, గుర్తింపుకార్డులు అందించడం అభినందనీయమన్నారు. సీఆర్పీ దూపటి చంద్రమౌళి, ఉపాధ్యాయులు వసంతరాణి, కవిత ఉన్నారు.

IN THE COURT OF THE III ADDL JUNIOR CIVIL JUDGE AT HANAMKONDA
O.S. No. 66 of 2024
Between:
1. MOHAMMED SHIRAZ MUSTAFA
Rep. by through G.P.A. holder MADHIHA MAIMUNA
2. MOHAMMED SHAHBAZ MUSTAFA
Rep. by through G.P.A. holder MADHIHA MAIMUNA
3. FARIHA SHAMAIL
Rep. by through G.P.A. holder HADHIHA MAIMUNA
4. MADIHA MAIMUNA
5. MALIHA ANJUM
Rep. by through G.P.A. holder MADHIHA MAIMUNA
... PLAINTIFFS
And
1. The State of Telangana through the District Collector, Warangal (Urban)
2. To whomsoever it may Concern.
... DEPENDENTS
NOTICE
TO,
TO WHOMSOEVER IT MAY CONCERNED
The general public is hereby informed that the above plaintiffs have filed the above suit for declaration that the plaintiffs are the legal heirs of the deceased Late Mohammed Mustafa Ali, S/o. Mohammad Jaffer Ali (Died on 05-06-2021) and Late Shameem Sultana, W/o. Late Mohammed Mustafa (Died on :07-06-2021) who are plaintiff No.1 to 5 are sons and daughters of the above both deceased parents, Who have died due to Covid-2019. The suit is posted on 23-08-2024, before the above court for filling objections, if any persons have any interest in the matter can appear and file objections either in persons or through an advocate duly instructed before the Hon'ble Court at 10.30 A.M. otherwise the matter will be heard and decided ex-parte.
(By order of the Hon'ble Court)
Sd/- MD. YOUSUF ALI, MD. FAROOQ ALI,
Advocates, H.No.9-2-48/1, Charbouli, Warangal Dist., Cell: 9849226367, 9949226367.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సర్టిఫికెట్స్ పోయినవి
★కరుణాకర్ పెద్ది, S/o. దివంగత వెంకటయ్య, వ: 47 సం.లు, మొత్కులగూడెం (V), జమ్మికుంట (M), కరీంనగర్ (D), అనే నేను తేది: 9-6-2024, ఆదివారం రోజు ఉ. 11:00 గం.లకు కాజీపేట్ నుండి హనుమకొండ బస్టాండ్‌కి ఆటోలో వెళుతున్న క్రమంలో నా బ్యాగులో ఉన్న నా యొక్క పోస్టు గ్రాడ్యుయేట్‌కి సంబంధించిన TC and Bonafide సర్టిఫికెట్స్ మిస్ అయ్యాయి. ఎవరికైనా దొరికితే దయచేసి ఈ నెం. 8886611112 కి కాల్ చేయండి.
NTW-00

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

వరంగల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ఖిలావరంగల్, జూలై 8: రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్య శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణ సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004253434, సెల్ నంబర్ 9154252936 సంప్రదించాలని తెలిపారు. కంట్రోల్ రూంలో అధికారులు 24గంటలు షిఫ్టుల వారీగా ఉంటారని పేర్కొన్నారు.

ప్రాణహాని లేకుండా చర్యలు చేపట్టాలి

డయేరియా వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకొని, ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డయేరియాను నిర్మూలిద్దామనే అంశంపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించాల్సిన మాత్రలపై వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

చిట్టీల పేర మోసం చేసిన కుటుంబం అరెస్ట్

ఖిలావరంగల్, జూలై 8: చిట్టీల పేరుతో మోసం చేసిన కుటుంబాన్ని మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ పీ మల్లయ్య తెలిపిన కథనం ప్రకారం.. అండర్ రైల్వేగేటు పెరికవాడకు చెందిన పుప్పాల రాజేందర్‌తోపాటు భార్య శ్రీలత, కుమారుడు అనురాగ్, కూతురు ప్రణవి ప్రభుత్వ అనుమతి లేకుండా మహాలక్ష్మి నెలవారి చిట్టీతోపాటు మహాలక్షి పరపతి సంఘాన్ని సుమారు 275 మందితో నిర్వహిస్తున్నారు. సభ్యులు డిపాజిట్ చేసిన సుమారు రూ.5కోట్లు వాడుకొని మోసం చేశాడని గిర్మాజిపేటకు చెందిన పెంచాల రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మార్చురీలో గుర్తుతెలియని మృతదేహం

ఖిలావరంగల్, జూలై 8: ఎంజీఎం మార్చురీలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం ఉంది. బంధువులు మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ లేదా ఎంజీఎం మార్చురీలో సంప్రదించాలని మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య తెలిపారు. ఈనెల 4న లేబర్‌కాలనీలోని విశాల్ మటన్ షాపు వద్ద సుమారు 80 ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడం స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ ఈనెల 6న మృతిచెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంగెం, జూలై 8: మండలంలోని ముమ్మిడివరంలోని సిద్ధార్థ పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులకు శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకోవటం ఆనందంగా గడిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగారపు సుధాకర్, నాటి గురువులు లెంకలపెల్లి మొగిలి, కొనకటి మొగిలి, దుడ్డె వెంకటేశ్వర్లు, కోటగిరి శ్రీనివాస్, పెండ్లి కుమారస్వామి, చంద్రస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

చెన్నారావుపేట/గీసుగొండ, జూలై 8: వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన కూరపాటి మల్లయ్య(70) ఇల్లు అమ్మకం విషయంలో గొడవ జరిగింది. మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కోడలు విలాసిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకకు చెందిన గజా నరేశ్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది మార్చి 10న గ్రామానికి వచ్చి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. నెల రోజులుగా ఫోన్ చేస్తున్నా ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో అతడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

ముంపునకు గురవకుండా పటిష్టచర్యలు

- మేయర్ గుండు సుధారాణి
- 13, 22వ డివిజన్ల కార్పొరేటర్లతో క్షేత్రస్థాయిలో పరిశీలన

కార్పొరేటర్లతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

కాశీబుగ్గ, జూలై 8: గ్రేటర్ వరంగల్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం 13, 22వ డివిజన్ల కార్పొరేటర్లు సురేష్‌జోషి, బస్వరాజ్ కుమారస్వామితో కలిసి డివిజన